# బలగం TV BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 17 డిసెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4


## మహిళా వర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు..



- **ఉత్తర్వులు జారీ**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ కోఠిలోని మహిళా విశ్వవిద్యాలయానికి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెడుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సోమవారం తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం పేరును వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీగా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు తెలంగాణ యూనివర్సిటీ చట్టం 1991లో (యాక్టు 4లో నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ యూనివర్సిటీకీ ఇంచార్జ్ వీసీగా ఉసకమానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగం సీనియర్ ప్రొఫెసర్ ధరావత్ సూర్యను నియమించారు. కాగా, ఈ విశ్వవిద్యాలయ నిర్వహణకు రూ. కోటి నిధిని మంజూరీ చేసింది.

# లగచర్లపై చర్చించాలని బీఆర్ఎస్ ఆందోళన



- **సభ నేటికి వాయిదా**
- **కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటాపోటీగా విమర్శలు**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

లగచర్ల రైతుకు బేడీలపై చర్చకు బీఆర్ఎస్ పట్టుబట్టడంతో అసెంబ్లీ దద్దరిల్లింది. అనంతరం శాసనసభ మంగళవారానికి వాయిదా పడింది. పర్యాటక శాఖపై కాకుండా లగచర్ల రైతుల బేడీల విషయంలో చర్చ చేపట్టాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. చర్చకు అనుమతించాలని ప్లకార్డులు పట్టుకుని నిరసనలు తెలిపారు. ఇదేమి రాజ్యం.. ఇదేమి రాజ్యం.. దోపిడీ రాజ్యం.. దొంగల రాజ్యం అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నినాదాలు చేశారు. విపక్ష సభ్యుల ఆందోళనతో శాసన సభను స్పీకర్ గడ్డం ప్రసాద్ వాయిదా వేశారు.

అసెంబ్లీలో పర్యాటక విధానంపై సర్కారు చర్చను ప్రారంభించగా, లగచర్ల రైతుకు బేడీలపై చర్చకు అనుమతించాలని ప్రతిపక్షం పట్టుబట్టింది. బీఆర్ఎస్ నిరసనలు, నినాదాల మధ్య ప్రశ్నోత్తరాల అనంతరం పదే పది నిమిషాలు సభ నడిచింది. మధ్యాహ్నం 2.:30 గంటలకు ప్రారంమైన సభ, 2:40కే వాయిదా పడింది. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పర్యాటక రంగంపై స్వల్పకాలిక చర్చకు అనుమతించగా ఆ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ గత పదేండ్లల్లో పర్యాటక రంగ అభివృద్ధికి సరైన విధానం రూపొందించలేదన్నారు. ఆదాయమే కాకుండా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పెంచేలా కొత్త విధానాన్ని అమలుచేయ నున్నామని ప్రకటించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దిగజార్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం అప్పుల కుప్పను, చిప్పను తెలంగాణ ప్రజల చేతికిచ్చిందని వ్యాఖ్యానించారు. వినోదంతోపాటు ఆదాయాన్ని పెంచే ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. అంతకుముందు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ పర్యాటక విధానంపై చర్చించాలని సభకు సూచించారు. సభ్యులు సభ సజావుగా నడవటానికి సహకరించాలని కోరారు. అనంతరం జూపల్లి మరింత వివరణ ఇచ్చే ప్రయత్నం చేయగా ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులు అడ్డు తగిలారు. లగచర్లపై చర్చకు పట్టుబడుతూ నినాదాలతో హోరెత్తించారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ జోక్యం చేసుకుంటూ సభా మర్యాదను కాపాడాలని బీఆర్ఎస్ నేతలు కె.తారకరామారావు, టి. హరీశ్‌రావు, ప్రశాంత్ రెడ్డిని కోరారు. రూల్‌బుక్ అందరమూ కలిసే తయారుచేసుకున్న సంగతిని గుర్తు చేశారు. సభకు ప్లకార్డులు తేవడం సరికాదనీ, నినాదాలు చేయడాన్ని తప్పుబట్టారు. అందరూ కూర్చోవాలని పదే పదే విజ్ఞప్తి చేశారు. కాగా బీఆర్ఎస్ సభ్యులు సీట్ల దగ్గర ఉండే నిరసన తెలుపుతుండగా, స్పీకర్ మార్షల్స్‌ను పిలిచారు. సభ్యుల దగ్గర ఉన్న ప్లకార్డులు తీసుకోవాలని ఆదేశించారు. మార్షల్స్ ఆ ప్రయత్నం చేస్తుండగానే బీఆర్ఎస్ సభ్యులు మార్షల్స్‌ను నెట్టుకుంటూ స్పీకర్ పోడియం దగ్గరకు చేరుకుని మళ్లీ నిరసనకు పూనుకున్నారు. స్పీకర్ పోడియంకు కుడివైపు హరీశ్‌రావు ప్లకార్డుతో వెళ్లగా, ఎడమవైపు కేటీఆర్ మిగతా సభ్యులతో ఆందోళనకు దిగారు. లగచర్ల రైతుకు బేడీలు వేయడం షేమ్ షేమ్ అన్నారు. రైతులకు కరెంటు షాకులు ఇస్తారా అంటూ ప్రశ్నించారు. ఇదేమీ రాజ్యం ఇదేమీ రాజ్యం..దొంగల రాజ్యం, దోపిడీ రాజ్యం అంటూ నినాదాలు చేశారు. ఇది జరుగుతుండగానే, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి 2:40 గంటలకు సభలోకి అడుగుపెట్టారు. సభా పరిణామాలను గమనిస్తూ కూర్చున్నారు. ఒకవైపు నిరసన, మరోవైపు మంత్రి జూపల్లి ప్రసంగం నడుస్తుండగానే మధ్యలో స్పీకర్ జోక్యం చేసుకుని సభను మంగళవారం ఉదయం 10 గంటలకు వాయిదా వేశారు.

అసెంబ్లీ వాయిదా పడిన అనంతరం బీఆర్ఎస్ సభ్యులంతా నినాదాలు చేసుకుంటూ మీడియా పాయింట్ వద్దకు వచ్చారు. అప్పటికే కాంగ్రెస్ సభ్యులు మీడియాతో మాట్లాడుతుండటంతో కొద్దిసేపు ఆగాల్సి వచ్చింది. కేటీఆర్, హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వం రెడ్డి తదితరులు నినాదాలు చేస్తూ దాదాపు అరగంటపాటు నిరసన తెలిపారు. లాఠీ రాజ్యం, లూటీ రాజ్యం, దొంగల రాజ్యం, దోపిడీ రాజ్యం, రైతులకు బేడీలు.. మంత్రులకు జల్సాలు అంటూ నినాదాలు చేశారు. రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



## నిర్మల వర్సెస్ ఖర్గే


**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

రాజ్యసభలో రాజ్యాంగంపై వాడీవేడి చర్చ కొనసాగింది. మాజీ ప్రధానులు నెహ్రూ, ఇందిరాగాంధీ ప్రస్తావనతో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆమె వ్యాఖ్యలకు ఏఐసీసీ మల్లికార్జున ఖర్గే అదే స్థాయిలో కౌంటర్ ఇచ్చారు.

నిర్మలా మాట్లాడుతూ 'కుటుంబం కోసం రాజ్యాంగాన్నే మార్చివేశారు. నెహ్రూ తాత్కాలిక ప్రభుత్వంలో వాక్ స్వాతంత్ర్యాన్ని అరికట్టేలా మొదటి సవరణ జరిగింది. మీడియా సంస్థలు ముఖ్యంగా రాజకీయంతో సంబంధం ఉన్న కీలక అంశాలపై లోతుగా విచారణ జరపరడాన్ని వ్యతిరేకించారు. పత్రికా స్వాతంత్ర్యాన్ని తగ్గించేందుకు ఏడాదిలోపే రాజ్యాంగాన్ని సవరించారు. ఇప్పుడు రాజ్యాంగ పరిరక్షణ గురించి స్పీచ్‌లు ఇస్తోంది' అని మండిపడ్డారు.

దీనికి ఖర్గే మాట్లాడుతూ 'లోక్‌సభలో రాజ్యాంగ చర్చ ద్వారా ప్రధాని మోడీ సభను తప్పుదోవ పట్టించారు. ఎలా మాట్లాడాలో ఈరోజు నేను వాళ్లకు చెప్పదల్చుకున్నా. నేను చదువుకుంది మున్సిపాలిటీ బడిలో. నిర్మలా సీతారామన్ జేఎన్‌యూలోనే చదవొచ్చు. ఆర్థిక నిపుణురాలే కావొచ్చు. కానీ, ఆమె మాట్లాడే విధానమే అస్సలు బాగోలేదు. జాతీయ పతాకాన్ని, అందులో అశోక చక్రాన్ని.. రాజ్యాంగాన్నే ద్వేషించినవాళ్లు.. ఇవాళ మాకు పాఠాలు చెబుతున్నారు. రామ్‌లీలా మైదానంలో గాంధీ, నెహ్రూ, అంబేద్కర్ దిష్టిబొమ్మలను తగలబెట్టిన విషయాన్ని వాళ్లు మరిచిపోయారేమో!" అని ఖర్గే మండిపడ్డారు.భారత రాజ్యాంగంతోపాటు త్రివర్ణ పతాకాన్ని సైతం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) వ్యతిరేకించిందన్నారు. ఎందుకంటే.. మనుస్మృతి ఆధారంగా లేదని వారు ఈ రాజ్యాంగాన్ని వ్యతిరేకించారని వివరించారు. కానీ 2002 జనవరి 26వ తేదీన తొలిసారిగా ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయంలో బలవంతంగా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తెలిపారు.

## సంక్రాంతి తర్వాత రేషన్ కార్డులు




- **భూమిలేనివారికి రూ.6 వేలు**
- **తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సుమారు ఐదు గంటలకు పైగా జరిగిన కేబినెట్ సమావేశంలో.. ఐదు ఆర్డినెన్స్‌లకు ఆమోదం తెలిపింది. ముఖ్యంగా.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన అన్నదాతలకు రైతు భరోసా ఇవ్వటంపై చర్చించిన కేబినెట్.. కీలక నిర్ణయం తీసుకుంది. గతకొంతకాలంగా చెప్తూ వస్తున్నట్టుగానే.. ఎట్టి పరిస్థితుల్లో సంక్రాంతి పండుగకు అన్నదాతల అకౌంట్లలో రైతు భరోసా డబ్బులు జమ చేయాలని కేబినెట్ నిర్ణయించింది.డిసెంబర్ 28న భూమిలేనివారికి రూ.6 వేలు ఇవ్వాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. సంక్రాంతి తర్వాత కొత్త రేషన్ కార్డులు జారీ చేసేలా మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. కేటీఆర్ ఈ-ఫార్ములా రేస్ నిధుల బదలాయింపుపై విచారణకు గవర్నర్ ఆమోదం తెలిపారని ప్రభుత్వం వెల్లడించింది. న్యాయనిపుణుల సలహాలు తీసుకుని గవర్నర్ ఆమోదం తెలిపారని.. సీఎస్ ద్వారా ఏసీబీకి లేఖ పంపుతామని ప్రభుత్వం పేర్కొంది.

ఇదే క్రమంలో.. కేబినెట్ భేటీ అనంతరం మీడియాతో చిట్ చాట్ నిర్వహించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.. కేటీఆర్ ఫార్ములా ఈ కారు రేసింగ్ వ్యవహారంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఏ బాంబు పేలుతుందన్నది కేటీఆర్‌కు త్వరలోనే తెలుస్తుందని చెప్పుకొచ్చారు. కేటీఆర్‌ను అరెస్ట్ చేయటం గురించి తనకు తెలియదని తెలిపారు. కేటీఆర్‌ను అరెస్టు చేస్తే రాష్ట్రం అగ్నిగుండం అవుతుందనడం వారి అహంకారపురిత మాటలకు నిదర్శనమని పొంగులేటి తెలిపారు. ప్రతిపక్షంగా విమర్శలు చేయడంలో తప్పు లేదన్నారు మంత్రి. కక్ష పూరితంగా కాంగ్రెస్ వ్యవహరించడం లేదని క్లారిటీ ఇచ్చిన మంత్రి.. తప్పులను బయటకు తీసి చర్చలో పెట్టామని పేర్కొన్నారు. ఐఎఎస్ అరవింద్ కుమార్‌పై కూడా చర్యలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని మంత్రి పొంగులేటి తెలిపారు.




## మార్చి 5 నుంచి ఇంటర్ పరీక్షలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ ఫస్ట్, సెకండ్ ఇయర్ వార్షిక పరీక్ష షెడ్యూల్ సోమవారం విడుదలైంది. ఈ షెడ్యూల్ ప్రకారం మార్చి 5 నుంచి 15 వరకు ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. ఫిబ్రవరి 3 నుంచి 22 వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు వార్షిక పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసింది. జనవరి 29న ఇంటర్ ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష, జనవరి 30న పర్యావరణ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొంది. ఫస్ట్ ఇయర్ ఇంగ్లీష్ ప్రాక్టికల్ ఎగ్జామ్స్ జనవరి 31న, సెకండ్ ఇయర్‌కు ఫిబ్రవరి 1న నిర్వహిస్తారు.

తెలంగాణ ఇంటర్ పరీక్షల షెడ్యూల్ ఇదే..

మిగితా 2వ పేజీలో




## నేడు పార్లమెంటుకు జమిలి బిల్లు..!

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

లోక్‌సభలో రాజ్యాంగ(129వ) సవరణ బిల్లు-2024ను మంగళవారం ప్రవేశపెట్టనున్నట్టు తెలుస్తోంది. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ఈ బిల్లును ప్రవేశపెట్టనున్నారు. విస్తృత సంప్రదింపులు జరిపేందుకు గానూ పార్లమెంటు ఉభయసభల ఉమ్మడి కమిటీకి ఈ బిల్లును సిఫారసు చేయాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను మేఘ్వాల్ కోరనున్నారు. ఎంపీల సంఖ్య ఆధారంగా ఆయా పార్టీలకు ఈ కమిటీలో చోటు కల్పించనున్నారు. ఏ పార్టీ తరపున ఎంతమంది సభ్యులు ఉంటారో స్పీకర్ సాయంత్రానికి ప్రకటించ నున్నారు. అతిపెద్ద పార్టీగా ఉన్న బీజేపీ నుంచి కమిటీ చైర్మన్ ఉండనున్నారు. కమిటీలో ఉండేందుకు ఎంపీల పేర్లను ఇవాళే ప్రతిపాదించాలని రాజకీయ పార్టీలను స్పీకర్ కోరనున్నారు. ప్రాథమికంగా ఈ కమిటీ కాలపరిమితి 90 రోజులు విధించనున్నారు. తర్వాత ఈ గడువును పొడిగించే అవకాశం ఉంది. కాగా, జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు 32 రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వగా, 15 పార్టీలు వ్యతిరేకించినట్టు ఇప్పటికే రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ప్రకటించింది.

## లగచర్ల రైతులు అధైర్యపడొద్దు.. పోరాడతాం



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

లగచర్ల రైతులపై ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై శాసన సభలో చర్చించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పట్టుబట్టడంతో అసెంబ్లీని రేపటికి వాయిదా వేశారు. దీంతో శాసనసభ లోపలికి వెళ్లే దారిలో కూర్చుని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. లగచర్ల అంశంపై చర్చించరట కానీ.. పర్యాటకంపై చర్చిస్తామంటున్నారని మండిపడ్డారు. లగచర్ల రైతులు ముగ్గురు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారని కేటీఆర్ తెలిపారు. ఓ రైతుకు గుండెపోటు వస్తే బేడీలతో ట్రీట్‌మెంట్ చేయించారని పేర్కొన్నారు. కొడంగల్ నీ జాగీరా.. రైతుల భూములు గుంజుకుంటారా అని మండిపడ్డారు. ఎన్ని కుయుక్తులు చేసినా రైతుల తరపున పోరాడతామని స్పష్టం చేశారు. ఆదానీతో రేవంత్ దోస్తీని నిలదీయాలని టీషర్టులతో వస్తే లోనికి వెళ్లనీయలేదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. లగచర్ల రైతుల అంశంపై చర్చించాలని పట్టుబట్టినా చర్చ పెట్టలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ అరాచకాలపై అసెంబ్లీలో నిలదీస్తామని స్పష్టం చేశారు. న్యాయం జరిగేదాకా పోరాడుతామని.. లగచర్ల రైతులు అధైర్యపడవద్దని ధైర్యం చెప్పారు. ఫార్మాసిటీకి 14 వేల ఎకరాలను సేకరించి పెడితే కాంగ్రెస్ ప్రభుత్వమే వద్దన్నదని తెలిపారు. రైతులకు రేవంత్ రెడ్డి భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

సీఎం రేవంత్ రెడ్డి పలుమార్లు ఢిల్లీకి వెళ్లి రాష్ట్రానికి రూపాయి తెచ్చింది లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ప్రశ్నించినా, సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టినా జైలుకు పంపిస్తామని రేవంత్ రెడ్డి బెదిరింపులకు గురి చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కొనసాగుతున్నది అరాచక ప్రభుత్వమా? ప్రజాస్వామ్య ప్రభుత్వమా అని కేటీఆర్ నిలదీశారు. రాజ్యాంగేతర శక్తిగా రేవంత్ రెడ్డి అన్న తిరుపతి రెడ్డి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.



## పాత జిల్లాలు రద్దు చేయం : మంత్రి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో కొత్త జిల్లాల రద్దుపై జరుగుతున్న ప్రచారానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అసెంబ్లీలో క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న అన్ని 33 జిల్లాలు యథావిధిగా కొనసాగుతాయని, వాటిని రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి ఆలోచన లేదని స్పష్టం చేశారు. గత కొద్దిరోజులుగా సోషల్ మీడియా, ఇతర వార్తా మాధ్యమాల్లో కొన్ని జిల్లాలను రద్దు చేస్తారని ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జిల్లాల విభజన అశాస్త్రీయంగా జరిగిందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 33 జిల్లాలను 17 లోక్‌సభ నియోజకవర్గాలుగా మార్చనున్నట్లు ఊహాగానాలు వెలువడుతున్నాయి. ముఖ్యంగా అసిఫాబాద్, సిద్దిపేట, కామారెడ్డి, వికారాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, మంచిర్యాల, భూపాలపల్లి వంటి జిల్లాలు రద్దు కానున్నాయనే ప్రచారం జరిగింది.

ఈ నేపథ్యంలో అసెంబ్లీలో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు మంత్రి పొంగులేటి సమాధానం ఇచ్చారు. "జిల్లాలను రద్దు చేసే ఉద్దేశం ప్రభుత్వం దరిదాపుల్లో కూడా లేదు. పాత జిల్లాల వ్యవస్థను తిరిగి తీసుకురావాలన్న ఆలోచన లేద"ని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ విధానాలు ప్రజల సంక్షేమానికి అనుగుణంగా ఉంటాయని, అప్రామాణిక వార్తలకు ప్రజలు నమ్మకంలేని విధంగా ఉండాలని సూచించారు.

### కేటీఆర్‌ను విచారించేందుకు గవర్నర్ అనుమతి

కార్ రేస్ వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను విచారించేందుకు గవర్నర్ అనుమతించారని, అయితే ఈ వ్యవహారంలో కేటీఆర్ అరెస్ట్‌పై తానేమీ మాట్లాడనని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. చట్టం మాత్రం తన పని తాను చేసుకుపోతుందన్నారు. కేబినెట్ భేటీ ముగిసిన అనంతరం ఆయన మాట్లాడుతూ... విచారణకు గవర్నర్ అనుమతించిన విషయాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి... ఏసీబీకి తెలియజేస్తారన్నారు. ఈ-కార్ రేసింగ్‌లో చట్ట ప్రకారమే ఏసీబీ దర్యాప్తు కొనసాగుతుందని హామీ ఇచ్చారు. గవర్నర్ అనుమతించడంపై కేబినెట్‌లో చర్చించినట్లు చెప్పారు. ఫార్ములా ఈ-రేసులో జరిగిన దోపిడీపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించిందన్నారు. అయితే ఈ కేసులో ఎవరి అరెస్ట్ గురించి తాను చెప్పబోనన్నారు. ఈ-రేస్ అంశంలో అర్వింద్ కుమార్‌పై కేసుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో కక్ష సాధింపు చర్యలు ఉండవని స్పష్టం చేశారు. కానీ అవినీతిని మాత్రం ప్రజల ముందు ఉంచుతున్నామన్నారు.

## గురుకుల హాస్టల్‌లో ఎలుకలు స్వైర విహారం



- **ఐదుగురు విద్యార్థులను కరిచిన ఎలుకలు**

**నవతెలంగాణ-కీసర**

కీసర మహాత్మా జ్యోతిబాపూలే బాలికల హాస్టల్‌లో ఎలుకలు స్వైర విహారం చేస్తున్నాయి. ఆదివారం రాత్రి విద్యార్థులు నిద్రించే సమయంలో ఐదుగురిని ఎలుకలు కరిచాయి. సమాచారం అందుకున్న హాస్టల్ సిబ్బంది, ప్రిన్సిపాల్ మహాలక్ష్మి విద్యార్థులను కీసర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే విషయం బయ టకు పొక్కకుండా విద్యార్థులకు చికిత్స అందిస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండా ప్రిన్సిపాల్ విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలాడుతున్నారని వారు మండిపడుతున్నారు. దీనిపై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా విద్యార్థులకు దద్దుర్లు, దురదలు వచ్చాయని, ఎలుకలు కరిశాయని తప్పుడు ప్రచారం అన్నారు. అయితే గురుకుల పాఠశాలలో విద్యార్థులను ఎలుకలు కరిచాయని, వారికి చికిత్స అందించినట్టు కీసర ప్రభుత్వాస్పత్రి వైద్యులు తెలపడం గమనార్హం.

### ట్విట్టర్ వేదికగా స్పందించిన హరీశ్‌రావు

కీసర జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో పలువురు విద్యార్థినులను ఎలుకలు కరిచినట్లు తెలుసుకున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ట్విట్టర్ వేదికగా స్పందించారు. బాలికల వసతి గృహంలో ఎలుకలు కొరికి అయిదుగురు విద్యార్థినులు ఆస్పత్రిపాలవడం దారుణ మన్నారు. కాంగ్రెస్ పాలనలో ఎలుకల కాట్లు, కుక్కకాట్లు, పాము కాట్లు, కరెంట్ షాకులతో విద్యార్థులు తల్లడిలు ్లతున్నా పట్టించుకోని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. గురుకుల బాట కార్యక్రమం ఎట్లుందంటే, మాటలు కోటలు దాటాయన్నారు. కాళ్లు తంగెళ్లు దాటవు అన్నట్లుగా ఉందని వ్యాఖ్యానించారు. గురుకుల బాట డొల్లతనం 24 గంటలు గడవక ముందే బయటపడిందని అన్నారు. ప్రచారం పేరిట ఒక్కరోజు తమాషా చేయడం కాదు..గురుకులాల్లో విద్యార్థులకు పాములు, ఎలుకలు, కుక్క కాట్లు లేకుండా చూడాలని సూచించారు.

## లంక అధ్యక్షునితో ప్రధాని మోడీ భేటీ



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం శ్రీలంక అధ్యక్షుడు అనూర కుమార దిసనాయకతో విస్తృత స్థాయిలో చర్చలు జరిపారు. రక్షణ, వాణిజ్యం, పెట్టుబడి సహా పలు రంగాల్లో భారత్ శ్రీలంక సహకారాన్ని మరింత వృద్ధి చేయడం లక్ష్యంగా చర్చలు జరిగాయి. శ్రీలంక అధ్యక్షునిగా

మిగితా 2వ పేజీలో

# రాష్ట్రంలో 9 మంది అదనపు డీసీపీలకు పదోన్నతి.. ఉత్తర్వులు జారీ

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్రంలో 9 మంది అడిషనల్ డీసీపీలకు రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. అలాగే ముగ్గురు డీసీపీలను బదిలీ చేసింది. ఈ మేరకు పదోన్నతులు కల్పిస్తూ హెూం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవి గుప్తా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాచకొండ డీసీపీ (స్పెషల్ బ్రాంచ్) పి.కరుణాకర్‌ను డీజీపీ కార్యాలయానికి రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఆయన స్థానంలో సైబరాబాద్ అదనపు డీసీపీ(క్రైమ్స్–%క్ష్మీ%)కు పదోన్నతి కల్పించారు. రాచకొండ డీసీపీ(ట్రాఫిక్) కె.మనోహర్‌ను రాచకొండ డీసీపీ (రోడ్ సేఫ్టీ)కి బదిలీ చేశారు. మాదాపూర్ డీసీపీ(ఎస్‌వోటీ) డి.శ్రీనివాస్‌ను మేడ్చల్ జోన్ డీసీపీ(ఎస్‌వోటీ)గా బదిలీ చేశారు.

పదోన్నతి పొందిన అదనపు డీసీపీలు వీళ్లే..

కె.గుణశేఖర్ – మేడ్చల్ డీసీపీ (ట్రాఫిక్)
జి.నరసింహారెడ్డి –రాచకొండ డీసీపీ ( స్పెషల్ బ్రాంచ్)
ఎస్.మల్లారెడ్డి – రాచకొండ డీసీపీ (ట్రాఫిక్)
మద్దిపాటి శ్రీనివాస రావు –సీఐడీ ఎస్పీ
పి.శోభన్ కుమార్ – మాదాపూర్ డీసీపీ(ఎస్‌వోటీ)
టి. సాయి మనోహం – మాదాపూర్ డీసీపీ (ట్రాఫిక్)
డి.రమేశ్ – ఎస్పీ (ఇంటెలిజెన్స్)
జే.చెన్నయ్య– ఐసీసీసీ హైదరాబాద్ ఎస్పీ
పి.విజయ్‌కుమార్ – సీఐడీ ఎస్పీ
కె.మనోహర్ రాచకొండ డీసీపీ (రోడ్ సేఫ్టీ)
డి.శ్రీనివాస్ మేడ్చల్ డీసీపీ (ఎస్‌వోటీ)
పి.కరుణాకర్ –(డీజీపీకి రిపోర్ట్)

## నేడు రాష్ట్రపతి రాక

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్రపతి ద్రౌపది ముర్మ నేడు హైదరాబాదర్ రానున్నారు. శీతాకాల విడిదికి నేటి నుంచి ఈ నెల 21 వరకు ఉండనున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పర్యటించనున్నట్లుగా షెడ్యూల్ విడుదల చేశారు. ఈ పర్యటనలో రాష్ట్రపతి సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో బస చేస్తారు. నేడు ఉదయం 11.30 గంటలకు విజయవాడ గన్నవరం ఎయిర్ పోర్టుకు చేరుకుని ఆంధ్రప్రదేశ్ లోని మంగళగిరి ఎయిమ్స్ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి పాల్గొననున్నారు. ఈ నెల 18న సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో రాష్ట్రపతి పలు కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. ఈ నెల 20న సికింద్రాబాద్ లోని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్ మెంట్ లోని కార్యక్రమంలో పాల్గొననున్నారు. అదే రోజు సాయంత్రం రాష్ట్రపతి నిలయంలో రాష్ట్ర ప్రముఖులు, విద్యావేత్తలు తదితరులకు ఎట్ హెూమ్ రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నారు.

## మార్చి 5 నుంచి ఇంటర్ పరీక్షలు

**(మొదటి పేజీ తరువాయి)**

| పరీక్ష తేదీ | వారం | పేపర్ |
|---|---|---|
| 05.03.2025 | బుధవారం | సెకండ్ లాంగ్వేజ్ పేపర్–1 |
| 07.03.2025 | శుక్రవారం | ఇంగ్లిష్ పేపర్ పేపర్–1 |
| 11.03.2025 | మంగళవారం | మాథ్స్ పేపర్ 1ఎ, బోటని పేపర్–1, పొలిటికల్ సైన్స్ పేపర్–1 |
| 13.03.2025 | గురువారం | మ్యాథ్స్ పేపర్ 1బి, జువాలజి పేపర్–1, హిస్టరీ పేపర్–1 |
| 17.03.2025 | సోమవారం | ఫిజిక్స్ , ఎకనామిక్స్ |
| 19.03.2025 | బుధవారం | కెమిస్ట్రీ , కామర్స్ |
| 21.03.2025 | శుక్రవారం | పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్–1, బ్రిడ్జ్ కోర్స్ మ్యాథ్య్ పేపర్–1(బైపీసీ విద్యార్థులకు) |
| 24.03.2025 | సోమవారం | మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్–1, జాగ్రఫీ పేపర్ –1 |

**ఇంటర్ సెకండియర్ పరీక్షల షెడ్యూలు..**

| పరీక్ష తేదీ | వారం | పేపర్ |
|---|---|---|
| 06.03.2025 | గురువారం | సెకండ్ లాంగ్వేజ్ పేపర్–2 |
| 10.03.2025 | సోమవారం | ఇంగ్లిష్ పేపర్ పేపర్–2 |
| 12.03.2025 | బుధవారం | మాథ్స్ పేపర్ 2ఎ, బోటని పేపర్–2, పొలిటికల్ సైన్స్ పేపర్–2 |
| 15.03.2025 | శనివారం | మ్యాథ్స్ పేపర్ 2బి, జువాలజి పేపర్–2, హిస్టరీ పేపర్–2 |
| 18.03.2025 | మంగళవారం | ఫిజిక్స్ , ఎకనామిక్స్ |
| 20.03.2025 | గురువారం | కెమిస్ట్రీ , కామర్స్ |
| 22.03.2025 | శనివారం | పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్–2, బ్రిడ్జ్ కోర్స్ మ్యాథ్య్ పేపర్–2 (బైపీసీ విద్యార్థులకు) |
| 25.03.2025 | మంగళవారం | మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్–2, జాగ్రఫీ పేపర్–2 |

ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్ ఎగ్జామినేషన్: 29.01.2025 (బుధవారం). సమయం: ఉ.10.00 గం. – మ.1.00 గం.

ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ ఎగ్జామినేషన్: 30.01.2025 (గురువారం). సమయం: ఉ.10.00 గం. – మ.1.00 గం.

## లంక అధ్యక్షునితో ప్రధాని మోడీ భేటీ

**(మొదటి పేజీ తరువాయి)**

సెప్టెంబర్‌లో ఎన్నికైన తరువాత దిసనాయక తన తొలి విదేశీ పర్యటనగా ఆదివారం ఢిల్లీ చేరుకున్నారు.చర్చలకు ముందు దిసనాయకకు రాష్ట్రపతి భవన్‌లో సాదరపూర్వక స్వాగతం లభించింది. 'వాణిజ్యం, పెట్టుబడి, అభివృద్ధి, భద్రత సహకారంపై విస్తృత అజెండాపై చర్చించనున్నారు' అని విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ ఉభయ నేతల చర్చల ముందు 'ఎక్స్' పోస్టులో తెలిపారు. శ్రీలంక అధ్యక్షుడు ఆదివారం విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్‌తోను, ఎన్ఎస్ఎ అజిత్ దోవల్‌తోను విడిగా సమావేశం అయ్యారు. శ్రీలంక అధ్యక్షుడు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కూడా భేటీ అవుతారు.



## పురిటి నొప్పులతో గ్రూప్-2 పరీక్ష రాసిన ఇల్లాలు

**బలగం టీవి, హైదరాబాద్**

నాగర్‌కర్నూల్ జిల్లాలో పురిటి నొప్పులతోనే ఓ అభ్యర్థి గ్రూప్–2 పరీక్ష రాశారు. బల్మూరు మండలం బాణాల గ్రామానికి చెందిన రేవతి నాగర్ కర్నూల్ పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రూప్–2 పరీక్ష రాసేందుకు వెళ్లారు. పరీక్ష రాస్తున్న సమయంలోనే ఆమెకు పురిటి నొప్పులు వచ్చాయి. అప్రమత్తమైన పరీక్ష నిర్వహణ సిబ్బంది.. ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యారు. అందుకు ఆమె అంగీకరించలేదు. పరీక్ష రాస్తానని చెప్పారు. ఆమె కాన్పు తేదీ సోమవారమే కావడంతో అందరూ కాస్త ఆందోళనకు గురయ్యారు.అయినా, ఆమె పట్టు వదలకుండా పరీక్ష రాస్తానని చెప్పడంతో.. అధికారులు ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ సంతోష్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం.. పరీక్ష కేంద్రంలో 108 అత్యవసర వాహనాన్ని అందుబాటులో ఉంచారు. ప్రత్యేక వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఆమెకు ఎప్పుడు తీవ్ర నొప్పులు వచ్చినా.. ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు అన్నీ సిద్ధంగా ఉంచారు. రేవతి భర్త, ఆమె తల్లి అందుబాటులో ఉన్నారు. ఆమె పరీక్ష రాసిన అనంతరం హాస్పిటల్ కు తీసుకెళ్లారు.

## బీఏసీ సమావేశం నుంచి బీఆర్ఎస్ వాకౌట్

**బలగం టీవి, హైదరాబాద్**

అసెంబ్లీలో జరుగుతున్న బీఏసీ సమావేశాల నుంచి బీఆర్ఎస్ వాకౌట్ చేసింది. సభ ఎన్నిరోజులు నడుపుతారు అనేదానిపై కాంగ్రెస్ నేతలు క్లారిటీ ఇవ్వకపోవడంతో సమావేశం నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ఎమ్మెల్యే హరీశ్‌రావు వెల్లడించారు.కనీసం 15 రోజులు సభ నడపాలని బిఆర్ఎస్ డిమాండ్ చేసింది. కాంగ్రెస్ నేతలు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో బీఆర్ఎస్,ఎంఐఎం ఎమ్మెల్యేలు బీఏసీ నుంచి వాకౌట్ చేశారు. బీఏసీ అంటే బిస్కట్ అండ్ చాయ్ సమావేశం కాదంటూ హరీశ్‌రావు కాంగ్రెస్‌పై మండిపడ్డారు. కాంగ్రెస్ ఏమీ తెల్చకపోవడంతో బయటకు వచ్చినట్లు వెల్లడించిన హరీశ్‌రావు. లగచర్ల అంశంపైన చర్చకు బీఆర్ఎస్ పట్టుపట్టింది. ఒక రోజు ప్రభుత్వానికి, మరోక రోజు విపక్షానికి ఇవ్వడం సంప్రదాయం అని హరీశ్‌రావు నొక్కి చెప్పారు.

లగచర్లపైన చర్చకు పట్టుపట్టినట్లు హరీశ్‌రావు వెల్లడించారు. రైతులకు బేడీలు వేసిన అంశం తమకు చాల కీలకం అన్న బీఆర్ఎస్. కచ్చితంగా ఈ అంశంపైన చర్చకు అవకాశం ఇవ్వాల్సిందే అని బీఆర్ఎస్ వాదించడంతో కాంగ్రెస్ నుంచి స్పందన ఇవ్వకపోవడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసహనం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ చేసిన డిమాండ్లకు బీఏసీకి కేవలం సూచన చేసే అధికారం మాత్రమే ఉందని సీఎం రేవంత్ వ్యాఖ్యలు చేయడంతో బీఆర్ఎస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. బీఏసీ చెప్పినట్టే సభ నడుస్తుందన్న బీఆర్ఎస్ వెల్లడించిందని సమాచారం.

## రేపటి నుంచి
## మార్చి నెల కోటా టికెట్లను విడుదల చేయనున్న టీటీడీ

**బలగం టీవి, హైదరాబాద్**

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) మార్చి నెలకు సంబంధించి వివిధ ఆర్జిత సేవలు, దర్శనాల టికెట్లను ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు విడుదల చేయనుంది. శ్రీవారి సుప్రభాతం, తోమాల సేవ, అర్చన, అష్టదళ పాద పద్మారాధన సేవల టికెట్లను డిసెంబరు 18న ఉదయం 10 గంటలకు ఆన్ లైన్ లో విడుదల చేయనున్నారు. ఈ టికెట్లు పొందిన వారు డిసెంబరు 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల్లోపు నగదు చెల్లించి లక్కీ డిప్ కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఇక, శ్రీవారి కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకరణ సేవ టికెట్లను డిసెంబరు 21న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు. అదే రోజున (డిసెంబరు 21) వర్చువల్ సేవా టికెట్లను కూడా విడుదల చేస్తారు. వర్చువల్ సేవలు, ఆయా సేవల ద్వారా లభించే దర్శన స్లాట్ల టికెట్లను మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేయనున్నారు.

డిసెంబరు 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణం టోకెన్లు విడుదల చేయనున్నారు. అదే రోజు (డిసెంబరు 23) ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు టికెట్లను ఆన్ లైన్ లో విడుదల చేయనున్నారు. అంతేకాదు, డిసెంబరు 23వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారి కోసం టికెట్లను విడుదల చేయనున్నారు. డిసెంబరు 24న రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను విడుదల చేయనున్నారు. అదే రోజు (డిసెంబరు 24) మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలో వసతి గదుల కోటాను విడుదల చేయనున్నారు. https://ttdevasthanams.ap.gov.in అధికారిక వెబ్ పోర్టల్ ద్వారా భక్తులు ఆన్ లైన్ లో టికెట్లు పొందవచ్చని టీటీడీ వెల్లడించింది.



## ముగిసిన దత్త జయంతి ఉత్సావాలు

**శ్రీ దత్తాత్రేయున్ని దర్శించుకున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వరదవెల్లిలో స్వయంభువుగా వెలిసిన శ్రీ దత్తత్రేయ 44వ జయంతి ఉత్చవాలు సోమవారంతో ముగిశాయి. సత్య దత్త వ్రాతలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దత్తత్రేయిని చరిత్ర ని వివరించారు. దత్తత్రేయుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేయడం తో పాటు అభిషేకాలు, హారతి, భజన కార్యక్రమాలు నిర్వహించారు. మూడవరోజు సిరిసిల్ల జడ్జితో పాటు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అడిషనల్ ఎఎస్పి శేషాద్రిరెడ్డి పలువురు దత్తాత్రేయను దర్శించుకోగా, ఎస్పీ అఖిల్ మహాజన్ కాంగ్రెస్ పార్టీ బి.సి.సెల్ జిల్లా అధ్యక్షులు కూస రవీందర్ తో కలిసి బోటులో వెళుతూ జలాశయ అందాలను ఆస్వాదించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, దత్తాత్రేయుని చరిత్రను అడిగి తెలుసుకున్నారు. మూడో రోజు సైతం భక్తులు దత్తాత్రేయున్ని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మూడో రోజు భక్తులు అధిక మొత్తంలో రావడంతో క్యూలో నిలబడి బోట్లో వెళ్లారు. పలువురు భక్తులు జలాశయ పరిసరాలను ఆస్వాదిస్తూ, సెల్ఫీలు తీసుకున్నారు. మూడు రోజులపాటు భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఎస్పీ వెంట రూరల్ సీ.ఐ శ్రీనివాస్,మండల ఎస్.ఐ పృథ్వీధర్ గౌడ్ రాగా కాంగ్రెస్ పార్టీ బీ.సీ.సెల్ జిల్లా అధ్యక్షులు కూస రవీందర్ ఎస్పీకి కండువగప్పి, మెమోంటోను అందజేయగ, ఆలయ కమిటీ చైర్మన్ నాగుల శ్రీనివాస్ శాలువా కప్పి దత్త దేవుని ఫోటోలను అందజేశారు.

## ముగిసిన గ్రూప్-2 పరీక్షలు

**రెండోరోజు పేపర్-3కి 45.62 శాతం, పేపర్-4కు 45.57 శాతం హాజరు**

**నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్**

గ్రూప్–2 రాతపరీక్షలు సోమవారంతో ముగిశాయి. ఈ పరీక్షలు ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ మేరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రూప్–2 పోస్టులకు 5,51,855 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. వారిలో 4,13,671 (74.96 శాతం) మంది హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారని పేర్కొన్నారు. రెండోరోజు సోమవారం ఎకానమి, డెవలప్‌మెంట్ పేపర్–3కి 2,51,738 (45.62 శాతం) మంది, తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావం పేపర్–4కు 2,51,486 (45.57 శాతం) అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. ఆదివారం పేపర్–1కు 2,57,981 (46.75 శాతం) మంది, పేపర్–2కు 2,55,490 (46.30 శాతం) మంది పరీక్ష రాసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో 18 శాఖల్లో 783 పోస్టుల భర్తీకి 2022, డిసెంబర్ 29న గ్రూప్–2 నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ విడుదల చేసిన విషయం తెలిసిందే.

## భార్య మృతికి కారణమైన భర్తకి 10 సంవత్సరాల జైలు శిక్ష...

**బలగం టీవీ , సిరిసిల్ల :**

భార్య మృతికి కారణమైన భర్తకి 10 సంవత్సరాల జైలు శిక్ష, 10,000/- రూపాయల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత సోమవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. గంబిరావు పేట గ్రామానికి చెందిన కడరి రాజశేఖర్, 2020 సంవత్సరంలో భార్య కడారి భాగ్యను అనుమానంతో కొట్టగా, ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందినది అన్నారు. అప్పటి ఎల్లారెడ్డిపేట సిఐ భాన్సీలల్ కేసు నమోదు చేసి రాజశేఖర్ ను రిమాండ్ కు తరలించి,కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారని అన్నారు.కోర్టు మానిటరింగ్ ఎస్ ఐ రవీంద్రనాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్, సీఎం ఎస్ కానిస్టేబుల్ నవీన్ లు కోర్టులో 16 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.శ్రీనివాస్ వాదించాగా కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి.. నేరం రుజువు కావడంతో నింధితుడైన కడరి రాజశేఖర్ కి 10 సంవత్సరాల జైలు శిక్షతో 10,000/- రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు.

సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుండి తప్పించుకొలేరని,శిక్షలతోనే సమాజంలో మార్పు వస్తుందని, పోలీసులు మరియు ప్రాసిక్యూషన్ వారు వ్యూహంతో న్యాయ విచారణ మరియు న్యాయ నిరూపణ జరిపి కచ్చితంగా శిక్షలు పడేలా చేస్తారని అన్నారు.పైకేసులో నిందితులకి శిక్ష పడటం లో కృషి చేసిన పీపీ పి.శ్రీనివాస్, సి ఎం ఎస్ ఎస్.ఐ రవీంద్రనాయుడు,కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్, సిఎంఎస్ కానిస్టేబుల్ నవీన్ లను ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేకంగా అభినందించారు.




## సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి..

- **ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు మొగిలి లక్ష్మణ్**

**బలగం టీవీ , సిరిసిల్ల**

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఎస్టియు జిల్లా అధ్యక్షులు మొగిలి లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.శనివారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం నిర్వహిస్తున్న సమ్మె కు ఎస్ టి యు జిల్లా అధ్యక్షులు మొగిలి లక్ష్మణ్ సమ్మె శిబిరాన్ని సందర్శించి సంపూర్ణ మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా శిబిరాన్ని ఉద్దేశించి జిల్లా అధ్యక్షులు మొగిలి లక్ష్మణ్ మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో జీవితాలను వెల్లదీస్తున్నటువంటి సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ఉద్యోగ భద్రత ,వేతనాల పెంపు పరిష్కారమయ్యే వరకు పోరడుదామని అన్నారు.ఉద్యోగ భద్రత ప్రక్రీయ ఆలస్యం అయిన పక్షంలో కనీస వేతనం వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేస్తూ రెగ్యులర్ చేయాలని, మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు అలాగే సమగ్ర శిక్ష ఉద్యోగులు నిర్వహిస్తున్న సమ్మెకు జిల్లా సంఘం సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. గత ప్రభుత్వంలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకొని వెంటనే సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని పేర్కొన్నారు.

## ఎల్లారెడ్డిపేట పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడిగా గోపాల చారి

- **ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల అధ్యక్షుడు శ్రీ గాద రమేష్**

**బలగం టీవీ , ఎల్లారెడ్డిపేట**




రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడిగా ఎర్రవెల్లి గోపాలచారని ఎన్నిక ద్వారా ఎన్నుకున్నారు. మండల స్వర్ణకార సంఘం అధ్యక్షుడు శ్రీగాద రమేష్ అధ్యక్షతన ఎన్నికల నిర్వహించారు. ఈ ఎన్నికలు పట్టణ స్వర్ణకార సంఘ భవనంలో నిర్వహించారు. ఎర్రవెల్లి గోపాల చారి, పాలోజు సతీష్, ఎర్రవెల్లి కృష్ణ చారి, శ్రీరామోజు సత్యనారాయణ లు అధ్యక్ష పదవికి నిలబడగా అత్యంత మెజారిటీతో ఎర్రవెల్లి గోపాల చారి అధ్యక్ష పదవిని దక్కించుకున్నారు. అనంతరం చెన్నోజు పురుషోత్తం ఉపాధ్యక్షులు చేస్తూ నిర్ణయించారు. క్యాషియర్ గా ఎర్రోజు దేవేందర్, సెక్రటరీగా శ్రీగాద సంతోష్ గౌరవ సలహాదారులుగా మర్రిపల్లి వేణు, శ్రీరామోజు శేఖర్, దుంపెన రమేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జీవితకాలం గౌరవ అధ్యక్షులుగా శ్రీగాద కేశవులు ని నియమించారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ... పట్టణంలోని స్వర్ణకార భవనం తో పాటు సంఘ సభ్యుల అభివృద్ధికై పాటుపడతామని హామీ ఇచ్చారు. అలాగే ప్రతి ఒక్కరు ఒకే మాటపై నిలబడి ఒకరికి ఒకరు సహాయపడేటట్టుగా సంఘంలో మెదులుకోవాలని సూచించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నందుకు సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరామోజు ప్రవీణ్,సత్యనారాయణ, ఎర్రోజు బాలా చారి, శ్రీ గాధ రాము, శ్రీగదా అశోక్, శ్రీరామోజు శ్రీనివాస్, శ్రీ గాద శ్రీనివాస్, ఎర్రవెల్లి కృష్ణ లు తదితరులు పాల్గొన్నారు. సంఘానికి విచ్చేసినటువంటి ఫ్యాక్స్ చైర్మన్ గుండారం కృష్ణారెడ్డి నూతన కమిటీ సభ్యులకు అభినందించి ఆనందం వ్యక్తం చేశారు.

## బాధితులకు సత్వర న్యాయం చేయడానికి గ్రీవెన్స్ డే..

- **ఎస్పీ అఖిల్ మహాజన్**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**



ప్రజల వద్ద నుండి పిర్యాదులు స్వీకరించి ప్రతి పిర్యాదుపై స్పందించి బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా గ్రీవెన్స్ డే ప్రతి సోమవారం నిర్వహిస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం రాజన్న సిరిసిల్ల కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించగా అర్జీదారుల నుండి ఎస్పీ అఖిల్ మహాజన్ స్వయంగా ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమావారం గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని,అందులో భాగంగా నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమనికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 17 ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించారు.

భూ తగాదాలు,ఆస్థి తగాదాల విషయం లో చట్ట ప్రకారం, నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా చూడాలని సూచించారు. గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందిస్తున్నామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేరస్థుల పట్ల కఠిన వైఖరి అవలంభిస్తూ శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూస్తామని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని తెలిపారు.



## బీసీల హక్కులు సాధించడమే లక్ష్యం

**బలగటివి , తంగళ్ళపల్లి**

జాతీయ బీసీ సంక్షేమ సంఘం తంగళ్లపల్లి మండల అధ్యక్షులు ఎగుర్ల కర్ణాకర్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు మ్యాకల పర్శరాములు మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులు బండి ప్రశాంత్, ప్రధాన కార్యదర్శి రెడ్డి రాజశేఖర్, కార్యదర్శులుగా ఎగుర్ల కనకరాజు, అవురగొండ ప్రశాంత్ ల కు నియామక పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పర్శరాములు మాట్లాడుతూ బీసీల హక్కుల పోరాటమే లక్ష్యమని నారాయణ గురు,మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే, వంటి మహనీయుల ఆశయాలే లక్ష్యంగా పెట్టుకొని బీసీల అభ్యున్నతికై పోరాడుతామన్నారు.ప్రజల్ని చైతన్య పరిచే విధంగా ముందుకు వెళ్తామని రాజకీయ,ఉద్యోగ నియామకాల్లో బీసీలకు జరుగుతున్న రిజర్వేషన్ ల అన్యాయాన్ని అరికట్టడమే లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కోరుట్ల రమేష్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు కాసార్ల అరుణ్, రుద్రంగి మండల అధ్యక్షులు మీసాల మల్లేష్ పటేల్, బీసీ నాయకులు గుంటి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## 24న కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల దిశ సమావేశం..

**- జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బి.శేషాద్రి**

**బలగం టీవీ , సిరిసిల్ల**

డిసెంబర్ 24న ఉదయం 11 గంటలకు కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ లోనికి ఆడిటోరియం హాల్ లో కరీంనగర్ , రాజన్న సిరిసిల్ల జిల్లాల అభివృద్ధి సమన్వయ మరియు మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశం నిర్వహిస్తున్నామని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బి.శేషాద్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బి.శేషాద్రి మాట్లాడుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చైర్మన్ గా జిల్లా అభివృద్ధి సమన్వయ మానిటరింగ్ కమిటీ సమావేశం డిసెంబర్ 24న జరుగుతుందని , ఇందులో రాష్ట్ర బీసీ రవాణా శాఖ మంత్రి , శాసనసభ్యులు, ప్రభుత్వ విప్, శాసనమండలి సభ్యులు పాల్గొంటారని , ఇట్టి సమావేశంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేయుచున్న పథకాల పై సమీక్ష నిర్వహించడం జరుగుతుందని, దానికి సంబంధించిన సమాచారంతో సంబంధిత అధికారులు విధిగా ఈ సమావేశానికి హాజరుకావాలని పేర్కొన్నారు.

## తల్లి పరీక్ష హాల్లో.. పసిబిడ్డ పోలీస్ ఒడిలో..

- **రెండు నెలల పాపాను ఎత్తుకొని ఆడించిన హోం గార్డ్...**

**బలగం టీవీ , వేములవాడ**



పోలీసు అంటే కాఠిన్యమే గుర్తుకు వస్తుంది. అయితే వారికీ సున్నిత హృదయం ఉంటుందని నిరూపించారు హోం గార్డ్ షాహనాజ్. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా రెండవ రోజు గ్రూప్ 2 పరీక్షలు కొనసాగుతుండగా, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పరిధిలోని దామిక డిగ్రీ కళాశాలలో పరీక్ష రాయడానికి ఒక మహిళ అభ్యర్థి తన రెండు నెలల పాపతో వచ్చారు. తల్లి పరీక్ష రాయడానికి పరీక్ష కేంద్రంలోకి వెళ్లడంతో నానామ్మ దగ్గర ఉన్న పాప ఎడవడంతో, ఇంతకీ ఏడుపు ఆపకపోవడంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న హోం గార్డ్ షాహనాజ్ గమనించి పాపా ని ఎత్తుకొని ఆడించింది. దీంతో పాప ఏడుపు మానింది.

## ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు..

- **అదనపు కలెక్టర్ ఎన్. ఖీమ్యా నాయక్**

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల**



ప్రజావాణికి వచ్చే అర్జీల పరిష్కారంలో జాప్యం చేయవద్దని జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. ఖీమ్యా నాయక్ అన్నారు . జిల్లా సమీకృత కార్యాలయాలలో ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆయా శాఖలకు వస్తున్న అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డివోలు సిరిసిల్ల, వేములవాడ వెంకట ఉపేందర్ రెడ్డి, రాజేశ్వర్, ఆయా శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ అదే బాట..

- భారత్ టాప్ ఆర్డర్ వైఫల్యం
- మూడో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ స్కోర్ 51/4
- ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ లో 445 పరుగులకు ఆలౌట్
- ఆసీస్ కంటే ఇంకా 394 రన్స్ వెనుకబడి ఉన్న టీమిండియా
- వర్షం అంతరాయంతో మూడో రోజు33 ఓవర్ల ఆట మాత్రమే




**బలగం టీవీ, అడిలైడ్**

బ్రిస్బేన్‌లో జరుగుతున్న మూడవ టెస్టులో భారత్ బ్యాటర్లు మళ్లీ అదే బాట పట్టారు. తక్కువ స్కోరుకే వెనుదిరగడంతో భారత్ కష్టాల్లో పడింది. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో తొలుత 445కు ఆస్ట్రేలియా ఆలౌట్ కాగా.. ఇండియా బ్యాటర్లు విఫలం కాగా వర్షం వల్ల ఆట నిలిచిపోయే సమయానికి ఇండియా నాలుగు వికెట్లు కోల్పోయి 51 రన్స్ చేసింది. ఆసీస్ పేస్ అటాక్ ముందు.. భారత బ్యాటర్లు చేతులెత్తేశారు. జైస్వాల్ 4, గిల్ 1, కోహ్లీ 3, పంత్ 9 రన్స్ చేశారు.

మూడో రోజు వరణుడు ఆధిపత్యం చెలాయించాడు. పదే పదే అంతరాయం కలిగించడంతో సోమవారం 33 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. 405/7 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను ప్రారంభించిన ఆసీస్.. 445 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఓవర్‌నైట్ బ్యాటర్ అలెక్స్ క్యారీ(70) హాఫ్ సెంచరీ సాధించగా.. మిచెల్ స్టార్క్(18) త్వరగానే ఔటయ్యాడు.

అనంతరం తొలి ఇన్నింగ్స్‌ను భారత్.. బౌండరీతో మొదలుపెట్టింది. కానీ ఆ మరుసటి బంతికే ఓపెనర్ యశస్వి జైస్వాల్(4) క్యాచ్ ఔట్ అయ్యాడు. క్రీజులోకి వచ్చిన శుభ్‌మన్ గిల్(1) స్లిప్ క్యాచ్‌గా వెనుదిరిగాడు. ఆదుకుంటాడని భావించిన కోహ్లీ.. మరోసారి తన ఔట్ సైడ్ ఆఫ్ స్టంప్ డెలివరీకి వెనుదిరిగాడు. ఈ దశలో రెండు సార్లు వర్షం అంతరాయం కలిగించింది. కమిన్స్ బౌలింగ్‌లో రిషభ్ పంత్(9) ఔటయ్యాడు. ఇక ఆట ఉమగిసే సమాయానికి కేఎల్ రాహుల్(33 బ్యాటింగ్)తో పాటు కెప్టెన్ రోహిత్ శర్మ(0) క్రీజులో ఉన్నాడు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్ 2 వికెట్లు తీయగా.. జోష్ హజెల్ వుడ్, ప్యాట్ కమిన్స్ తలో వికెట్ తీసారు. ఫాలో ఆన్ గండం తపపించుకోవాలంటే భారత్ కనీసం 246 పరుగులు చేయాలి. నాలుగో రోజు పూర్తిగా బ్యాటింగ్ చేస్తేనే.. ఈ మ్యాచ్‌లో భారత్ ఓటమి తప్పించుకోగలదు. లేకుంటే మరో ఘోర పరాజయం తప్పదు.



## ఛాంపియన్ గుకేశ్‌కు గ్రాండ్ వెల్‌కమ్

**బలగం టీవీ, చెన్నై**

ప్రపంచ చెస్ చాంపియన్‌గా నిలిచిన 18 ఏళ్ల గుకేశ్ స్వదేశానికి చేరుకున్నారు. సోమవారం ఉదయం తమిళనాడు రాజధాని చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ అయ్యారు. ఈ సందర్భంగా గుకేశ్‌కు ఘన స్వాగతం లభించింది. పాఠశాల విద్యార్థులు, అధికారులు గుకేశ్‌ను ఘనంగా స్వాగతించారు. భారత జెండాలు ప్రదర్శిస్తూ పూల వర్షంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గుకేశ్ మాట్లాడుతూ.. తనకు మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. సింగపూర్‌లో జరిగిన ఫిడే వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్‌లో చైనా క్రీడాకారుడు డింగ్ లిరెన్‌ను ఓడించి అతను విశ్వ విజేతగా నిలిచాడు.

గుకేశ్ కట్టాల్సిన పన్ను రూ. 4.67కోట్లు..!

వరల్డ్ చెస్ ఛాంపియన్‌గా నిలిచిన గుకేశ్‌కు మొత్తం రూ. 11.34 కోట్ల ప్రైజ్ మనీ దక్కినట్టు తెలుస్తోంది. ఫీడే రూల్ ప్రకారం మొత్తం ఛాంపియన్‌షిప్ ప్రైజ్ మనీ మొత్తం రూ. 20.75 కోట్లు కాగా, ఒక గేమ్ గెలిచిన ఆటగాడికి రూ. 1.69 కోట్లు ఇస్తారు. దీని ప్రకారం 3 గేమ్‌లు గెలిచిన గుకేశ్‌కు రూ. 5.04 కోట్లు లభించాయి. రెండు గేమ్లు గెలిచిన డింగ్‌కి రూ. 3.36 కోట్లు దక్కాయి. మిగిలిన దాన్ని సమానంగా పంచారు. దాంతో గుకేశ్‌కు మొత్తం రూ. 11.34 కోట్ల నగదు పురస్కారం దక్కినట్టు తెలుస్తోంది.

అయితే గుకేశ్ భారీ మొత్తంలో పన్ను చెల్లించాల్సి ఉంది. ప్రైజ్ మనీ కింద అతనికి దక్కిన రూ. 11.34 కోట్లపై రూ. 3కోట్ల వరకు ఆయన పన్ను చెల్లించాల్సి ఉంటుందని అంచనా. ఇతర సర్‌ఛార్జీలతో కలిపి మొత్తంగా రూ. 4.67 కోట్ల వరకు ట్యాక్స్ కట్టాల్సి ఉంటుందని నిపుణులు లెక్కగడుతున్నారు. దీనికి కారణం గుకేశ్ నికర ఆస్తి రూ. 21 కోట్లకు పెరగడమే. దీంతో ఇన్‌కమ్ ట్యాక్స్ నిబంధనల ప్రకారం 30 శాతం పన్ను స్లాబ్ కింద లెక్కలేస్తున్నారు. కాగా, ప్రపంచ వేదికపై దేశానికి ప్రాతినిధ్యం వహించిన గుకేశ్‌పై ఇంత భారీ పన్నులు వేయడం పట్ల నెటిజన్లు వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. "ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకున్నందుకు, రూ. 11 కోట్ల ప్రైజ్ మనీలో రూ. 5 కోట్లు సంపాదించినందుకు భారత పన్ను శాఖకు అభినందనలు" అని ఒకరు కామెంట్ చేశారు.

## షకీబ్ అల్ హసన్‌పై ఐసీసీ నిషేధం

**బలగం టీవీ, న్యూఢిల్లీ**




అంతర్జాతీయ క్రికెట్ లోనే కాకుండా, విదేశాల్లోని ఏ లీగ్ లోనూ బౌలింగ్ చేయకుండా బంగ్లాదేశ్ స్టార్ క్రికెటర్, మాజీ కెప్టెన్ షకీబ్ అల్ హసన్ పై ఐసీసీ నిషేధం విధించింది. షకీబ్ అల్ హసన్ బౌలింగ్ యాక్షన్ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్టు ఐసీసీ గుర్తించింది. నిబంధనల ప్రకారం 15 డిగ్రీల కంటే ఎక్కువగా మోచేయి వంగితే, దాన్ని బౌలింగ్ గా పరిగణించరు. గత కొంతకాలంగా లెఫ్టార్మ్ స్పిన్నర్ షకీబ్ బౌలింగ్ యాక్షన్ పై ఫిర్యాదులు రావడంతో, ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు అతడికి బౌలింగ్ టెస్ట్ నిర్వహించింది. ఈ పరీక్షలో షకీబ్ మోచేయి నిబంధనలకు విరుద్ధంగా 15 డిగ్రీల కంటే ఎక్కువగా వంగుతున్నట్టు తేలింది. దాంతో, మొదట అతడిపై ఇంగ్లండ్ బోర్డు నిషేధం విధించింది. అనంతరం ఐసీసీ కూడా అతడిపై వేటు వేసింది. ఈ విషయాన్ని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు కూడా నిర్ధారించింది. ఐసీసీ బ్యాన్ నేపథ్యంలో, జాతీయ క్రికెట్ లోనూ అతడు బౌలింగ్ చేయడానికి అనర్హుడు అని బంగ్లాదేశ్ బోర్డు వెల్లడించింది.

37 ఏళ్ల షకీబ్ అల్ హసన్ ఓ ఆల్ రౌండర్ గా బంగ్లాదేశ్ జాతీయ జట్టుకు విశిష్ట సేవలు అందించాడు. ఇప్పటిదాకా 71 టెస్టుల్లో 37 సగటుతో 4,609 పరుగులు చేశాడు. టెస్టుల్లో 246 వికెట్లు పడగొట్టాడు. 247 వన్డేల్లో 7,570 పరుగులు చేసి, 317 వికెట్లు తీశాడు. 129 అంతర్జాతీయ టీ20ల్లో 2,551 పరుగులు, 149 వికెట్లు నమోదు చేశాడు.

## ద్రవిడ్ రికార్డ్ బ్రేక్ చేసిన కోహ్లీ

**బలగం టీవీ, న్యూఢిల్లీ**



బ్రిస్బేన్‌లో జరుగుతున్న మూడవ కోహ్లీ ఓ రికార్డును అందుకున్నాడు. మాజీ క్రికెటర్, కోచ్ రాహుల్ ద్రవిడ్ రికార్డును బ్రేక్ చేశాడు. మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో 3 పరుగులకే అవుటైనా టెస్టుల్లో ఆస్ట్రేలియాపై అత్యధిక పరుగులు చేసిన భారత ఆటగాడిగా నిలిచాడు. రాహుల్ ద్రవిడ్ ఆస్ట్రేలియాపై 62 ఇన్నింగ్స్‌లో 2166 పరుగులు చేశాడు. ఇప్పుడు విరాట్ 48 టెస్ట్ ఇన్నింగ్స్‌లో 2168 రన్స్? సాధించాడు. అలా ద్రవిడ్ రికార్డును అధిగమించి, ఆసీస్‌పై అత్యధిక పరుగులు చేసిన మూడో భారత బ్యాటర్‌గా కోహ్లీ నిలిచాడు. సచిన్ టెండుల్కర్(3630), వీవీఎస్ లక్ష్మణ్ (2434) పరుగులు చేసి తొలి రెండు స్థానాల్లో నిలిచారు.

## కన్నప్ప' నుంచి మోహన్ లాల్ లుక్ రిలీజ్

**బలగం టీవీ, హైదరాబాద్**




మంచు కుటుంబం నుంచి వచ్చిన ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ 'కన్నప్ప'లో నటిస్తున్న మోహన్ లాల్ పాత్ర తాలూకు ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. మైథలాజీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న చిత్రాన్ని దాదాపు రూ.100 కోట్ల భారీ బడ్జెట్‌తో మంచు మోహన్ బాబు నిర్మిస్తున్నారు. మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమాకు ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రభాస్, అక్షయ్ కుమార్, శరత్ కుమార్ వంటి భారీ తారాగణం నటిస్తున్నారు. ఇప్పటికే ఈ మూవీ నుంచి మంచు మోహన్ బాబు, మంచు విష్ణులతో పాటు ఇతర కీలక తారాగణం ఫస్ట్ లుక్‌లను మేకర్స్ విడుదల చేశారు. ఇప్పుడు మలయాళం స్టార్ నటుడు మోహన్ లాల్ ఫస్ట్ లుక్‌ను చిత్రబృందం రిలీజ్ చేసింది. ఈ మూవీలో ఆయన 'కిరాట' అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించబోతున్నట్టు మేకర్స్ తెలిపారు. ఇక తాజాగా విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో చూడటానికి ఆయన చాలా గంభీరంగా కనిపిస్తున్నారు.

## ప్రభాస్ కాలికి గాయం

**బలగం టీవీ, హైదరాబాద్**



అగ్ర కథానాయకుడు ప్రభాస్ కాలికి గాయమైంది. . ఓ సినిమా షూటింగ్‌లో భాగంగా.. ఆయన గాయపడినట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన విశ్రాంతి తీసుకుంటున్నట్లు తెలుస్తుంది. అయితే ఈ విషయాన్ని ప్రభాస్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించాడు.

ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'కల్కి 2898 ఏడీ'ని వచ్చే ఏడాది జపాన్‌లో విడుదల చేస్తున్నారు మేకర్స్. జనవరి 3న జపాన్‌లో విడుదల కానుంది. ఈ సందర్భంగా జపాన్‌లో ప్రమోషన్స్‌లో పాల్గొనాల్సి ఉంది ప్రభాస్. అయితే తాను ఈ వేడుకకు రాలేకపోతున్నానని ప్రభాస్ వెల్లడించారు. మీరు నాపై చూపిస్తున్న ప్రేమకు, అభిమానాలకు ధన్యవాదాలు. జపాన్‌లోని అభిమానులని కలవాలని ఎప్పటినుంచో అనుకుంటున్నా. కానీ మూవీ షూటింగ్‌లో నా కాలుకు గాయమైంది. దీంతో ఈ జపాన్‌కు రాలేకపోతున్న.. ఈ విషయంలో నన్ను క్షమించండి" అంటూ ప్రభాస్ రాసుకొచ్చాడు.

## 11 రోజుల్లో రూ.1409 కోట్లు

- పుష్ప 2 అస్సలు తగ్గేదేలే..

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్–సుకుమార్ కాంబోలో తెరకెక్కిన 'పుష్ప 2' బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తోంది. తాజాగా 'ఆర్ఆర్ఆర్' ఓవరాల్ కలెక్షన్స్ రికార్డ్ బ్రేక్ చేసింది. ఇప్పటివరకూ పుష్ప 2 వరల్డ్‌వైడ్‌గా రూ.1409 కోట్లు వసూళ్లు సాధించినట్టు మేకర్స్ ఓ పోస్టర్ రిలీజ్ చేశారు. దీంతో భారతీయ సినీ ఇండస్ట్రీలో అత్యధిక వసూళ్లు సాధించిన మూడో సినిమాగా కొనసాగుతోంది.కాగా, బాలీవుడ్ స్టార్ హీరో ఆమిర్ ఖాన్ దంగల్ (రూ.2000 కోట్లు), బాహుబలి 2 (రూ.1800 కోట్లు) తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి.

## 'నా డ్రీమ్ ప్రాజెక్ట్ 'మహాభారతం" : ఆమీర్‌ఖాన్

**బలగం టీవీ, హైదరాబాద్**

బాలీవుడ్ స్టార్ హీరో ఆమిర్ ఖాన్ 'మహాభారతం' తన డ్రీమ్ ప్రాజెక్ట్ అని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. 'నా డ్రీమ్ ప్రాజెక్ట్ మహాభారతం పట్ల నాపై చాలా బాధ్యత ఉంది. దాంతోపాటు భయం కూడా ఉంది. ఎక్కడా పొరపాటు లేకుండా భారీ స్థాయిలో ఈ ప్రాజెక్ట్ రూపొందించాలని అనుకుంటున్నాను. భారతీయులుగా ఈ కథ మన రక్తంలోనే ఉంది. కాబట్టి, ఇది నాపై ఎంతో బాధ్యత పెంచింది. అందుకే దీనిని సరైన పద్ధతిలో సక్రమంగా తీర్చిదిద్దాలనుకుంటున్నా. ఈ ప్రాజెక్ట్‌తో భారతదేశ గొప్పతనాన్ని ప్రపంచానికి చూపించాలని అనుకుంటున్నా. ప్రతి భారతీయుడు గర్వపడేలా చేయాలనుకుంటున్నా. ఇది జరుగుతుందో? లేదో? తెలియదు. కానీ నేను మాత్రం దీని కోసం హార్డ్? వర్క్ చేయాలనుకుంటున్నా' అని ఆమిర్ ఖాన్ చెప్పారు.